

నీలకంఠేశ్వరాలయంలో ఓం ఆకారంలో దీపాలను వెలిగించిన మహిళలు

# దీపోత్సాహం

సుభాష్‌నగర్, నవంబర్ 25 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నీల కంఠేశ్వరాలయంలో ఆకాశ దీపోత్సవాన్ని సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక దీపారాధనలో భాగంగా స్వస్తిక్, ఓంకార ఆకారాల్లో దీపాలను వెలిగించారు. ఆలయంలో పూజల అనంతరం ఆలయ అధికారులు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్తీక మాస నాలుగో సోమవారాన్ని పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు ఆకాశదీపం, ఉసిరి వృక్షాల కింద దీపాలను వెలిగించారని ఈవో రవీందర్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు మకరంద్, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆ సర్వే తప్పయితే ఇదేలా ఒప్పు?

సమగ్ర కుటుంబసర్వే బుక్‌లెట్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



- నాడు వద్దన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడెలా చేయిస్తారు?
- గోప్యత హక్కులకు విరుద్ధంగా ఆస్తుల సేకరణ
- పథకాలు ఎగ్గొడితే పోరాటం తప్పదు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


వేల్పూర్, నవంబర్ 25: సర్వే పేరుతో గోప్యత హక్కుకు విరుద్ధంగా ప్రజల ఆస్తులు, అంతస్తులు, వాహనాలు, ఇతర స్థిర, చరాస్తులు ఎలా సేకరిస్తారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను తప్పుబట్టిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సర్వే ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. వేల్పూర్ మండల కేంద్రంలోని తన నివాసానికి సోమవారం సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు వేముల.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి సర్వేకు వ్యతిరేకంగా మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు సర్వే వద్దని మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు సర్వే చేయిస్తున్నారని ప్రశ్నించారు. తనకు వివరాలు ఇవ్వటానికి అభ్యంతరం లేదన్న ప్రశాంత్‌రెడ్డి.. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేను తప్పు అంటూ వివరాలు సేకరించటానికి అడ్డమైన వాళ్లను ఇంటికి పంపిస్తారంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే వ్యక్తిగత వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన గోప్యత హక్కులకు విరుద్ధంగా ఆస్తులు, అంతస్తులు, వాహనాలు తదితర స్థిర, చరాస్తుల వివరాలు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. గడువు లోపు సర్వే పూర్తి చేయాలనే ఆతృతలో తప్పులు దొర్లే ప్రమాదముందని పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనార్టీలు, అగ్రవర్ణాల పేదలకు కూడా సర్వే ద్వారా సరైన న్యాయం దక్కేలా వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే పేరిట టీవీ, ఫ్రిడ్జ్, స్కూటర్ లాంటి సాధారణ అంశాలను పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం జరిగితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజల తరపున పోరాటం చేస్తామని వేముల హెచ్చరించారు.

# ఉల్లి.. కృత్రిమ లొల్లి

- నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీగా నిల్వలు
- మార్కెట్‌లో సప్లై లేక పెరిగిన ధరలు
- దళారుల దందాకు సామాన్యులు బలి
- బాధ్యత మరిచిన యంత్రాంగం
- దాడులు చేస్తే ధరలు అదుపులోకి..
- ఉల్లి సాగును ప్రోత్సహించడంలో ఉద్యాన శాఖ వైఫల్యం

కొరత సృష్టించిన వ్యాపారులు







నిజామాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా లేకపోతే ధరలు పెరగడం సహజం. ఈ ఆర్థిక సూత్రాన్ని వంటబట్టించుకున్న కొందరు దళారులు సరఫరా వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. మార్కెట్‌లోకి ఉల్లి రాకుండా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ఫలితంగా వాటి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. దళారుల దోపిడీకి అటు ప్రజలు, ఇటు చిరు వ్యాపారులు చితికి పోతున్నారు. టన్నుల కొద్దీ నిల్వలు పెట్టుకున్న కొందరు హోల్ సేల్ వ్యాపారులు కృత్రిమంగా కొరత సృష్టిస్తూ ఇష్టానుసారంగా ధరలు పెంచేస్తూ వారు మాత్రం రెండు చేతులా సంపాదిస్తున్నారు. మహారాష్ట్రలోని పంట పరిస్థితులను సాకుగా చూపి అక్కడ లభించే ధరకు మూడు, నాలుగు రెట్లు అదనంగా ఇక్కడి వ్యాపారులు వసూలు చేస్తున్నారు. జనం దోపిడీకి గురవుతున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఫలితంగా దళారుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

## భారీగా నిల్వలు..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రహస్యంగా పలు ప్రాంతాల్లో భారీగా ఉల్లిగడ్డలు నిల్వ చేసినట్లు తెలిసింది. టన్నుల కొద్దీ ఉల్లిగడ్డలను దిగుమతి చేసుకుని, వాటిని డిమాండ్‌కు సరిపడా బయటకు తీయకుండా కొద్ది మొత్తంలోనే అందుబాటులోకి తీసుకొస్తూ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉల్లి విక్రయాలతో లాభాలు పొందాలనుకునే చిరు వ్యాపారులు బోల్తా కొడుతున్నారు. దళారులు, బడా వ్యాపారుల మాయాజాలంలో చితికి పోయి విలవిల్లాడుతున్నారు. ధరల హెచ్చు తగ్గుల వల్ల కొనుగోళ్లకు పరుగులు తీసి చిరు వ్యాపారులతో పాటే వినియోగదారులు నష్ట పోతున్నారు. కళ్ల ముందు ఇంతటి భారీ దందా జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం స్పందించడం లేదు.

## లాభాల కోసం..

ఉల్లిగడ్డల కోసం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన వ్యాపారులు 80శాతం మహారాష్ట్ర మార్కెట్‌పైనే ఆధారపడతారు. కొత్త పంట లేకపోవడం వల్ల పాత పంటనే అధికంగా వస్తున్నది. పాత, కొత్త సీజన్ల మధ్య ఉల్లి మార్కెట్ ఒడిదొడుకులకు గురవుతున్నది. వానాకాలం మధ్యలో ఇలాంటి ఆటుపోట్లు ఎదురవ్వడంపరిపాటి. కానీ నెలల తరబడి ధరలను భారీగా పెంచేసి కొనసాగించడమే అందరికీ ఇబ్బందిగా మారింది. ప్రధానంగా ఆగస్టు, సెప్టెంబర్ మధ్య ఇలాంటి పరిస్థితులు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తాయి. ఈ సమయంలో ఏపీలోని కర్నూలు జిల్లా నుంచి కొంత సరుకు వచ్చి ఆదుకుంటున్నది. తెల్ల, ఎర్ర ఉల్లిగడ్డ కిలోకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఆదివారాల్లో మరింత బాదుతున్నారు.

## ఉద్యానశాఖ మొద్దు నిద్ర..

నిత్యావసరాల్లో అతి ముఖ్యమైన ఉల్లి సాగుకు ఉన్న డిమాండ్ దృష్ట్యా రైతులను ఉల్లి సాగు వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నది. గతంలో కేసీఆర్ సర్కారు హయాంలో ఈ తరహా ప్రయత్నం చేసినప్పటికీ సంబంధిత శాఖ మొద్దు నిద్ర మూలంగా రైతుల్లో చైతన్యం కొరవడింది. మార్కెట్‌లో అధిక లాభాలను అందించే ఉల్లి సాగు విషయంలో రైతులను ప్రోత్సహిస్తే ఓ వైపు ప్రజలకు, మరోవైపు వ్యాపారులకు లాభించే వీలు ఉంది. కానీ ఆ దిశగా ఉద్యాన శాఖ ప్రణాళికలు రూపొందించడం లేదు. ఈ శాఖను నడిపించేందుకు ఉన్నతాధికారులు, ఉభయ జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సైతం చొరవ తీసుకోవడం లేదు. పొరుగు రాష్ట్రాల నుంచి ఉల్లి పంట దిగుమతులు పెరుగుతుండటంతో పాటు భారత్ నుంచి ఉల్లి ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం నిషేధించడం, ఇతర దేశాల నుంచి దిగుమతులు ప్రోత్సహించడం వంటి చర్యలతో ఉల్లి ధరలు ఇప్పటికే నేల చూపులు చూడాలి. కానీ, అలాంటి మార్పు కనిపించకపోవడం వెనుక బడా వ్యాపారులు వారి వెనుక ఉన్న అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

## శివారులో భారీగా నిల్వలు..

మహారాష్ట్రలో పంట దెబ్బతిన్న కారణంగా సరుకు భారీగా రావడం లేదని సాకు చెబుతూ వ్యాపారులు భారీగా డంప్‌లను పెట్టారు. నిజామాబాద్‌లోని అర్సపల్లి శివారు ప్రాంతాల్లో టన్నుల కొద్దీ నిల్వలు పోగై ఉన్నాయి. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా మార్కెట్లోకి ఉల్లిని పంపించకుండా, కృత్రిమ కొరతను కొంత మంది దుండగులు సృష్టిస్తున్నారు. అధిక ధరలకు హోల్ సేల్ వ్యాపారులు విక్రయించడం మూలంగా రిటైల్ వ్యాపారులు కూడా కిలో ఉల్లిని రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉల్లి ధరల మాయాజాలంలో దళారులు చెలరేగిపోతున్నారు. సెప్టెంబర్ వరకు ఒడిదొడుకులతో కొట్టుమిట్టాడిన ఉల్లి ధరల వ్యత్యాసం ఇప్పుడేకంగా స్థిరంగా రూ.200లకు 5కిలోలు చొప్పున విక్రయించే పరిస్థితికి వచ్చింది. ఉల్లి ధర తగ్గదా? అని ప్రశ్నిస్తే ఏదో ఒక బూచీ చూపిస్తున్నారు. అక్టోబర్‌లో తలెత్తిన వర్షాల ప్రభావంతో ఉల్లి రాక మందగించినప్పటికీ ప్రస్తుతం ఉల్లి లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేవు. కానీ దళారులు మాత్రం తమ లాభార్జన కోసం ఇంకా కొరతను సృష్టిస్తున్నట్లుగా అనుమానాలు ఉన్నాయి. నిజామాబాద్ శివారుతో పాటు కామారెడ్డి జిల్లాలోని గంజ్ ప్రాంతంలోనూ భారీగా ఉల్లి నిల్వలు ఉన్నాయి. వీటిని మార్కెట్లోకి సరైన రీతిలో పంపిస్తే ధరలు తగ్గుముఖం పట్టి సామాన్యులకు ఊరట దక్కే వీలుంది. నాలుగేళ్ల క్రితం ఉల్లి కిలోకు రూ.15కే లభించింది. కాని ప్పుడు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పావు కిలో కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

# మొరం టిప్పర్లను అడ్డుకున్న మత్స్యకారులు

నీలా ఖజానా కుంట చెరువులో మొరం టిప్పర్లను అడ్డుకుంటున్న మత్స్య కారులు



రెంజల్, నవంబర్ 25 : మండలంలోని నీలా శివారులో గల ఖజానా కుంట నుంచి అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్లను మత్స్యకారులు సోమవారం అడ్డుకున్నారు. అభివృద్ధి పనుల కోసమని మొరం తరలించడంపై మత్స్యకారులు తహసీల్దార్‌ను కలిసేందుకు వెళ్లారు. అయితే, ఆయన అమర్యాదగా ప్రవర్తించారని కోపోద్రిక్తులైన మత్స్యకారులు.. సోమవారం ఉదయం చెరువు వద్దకు చేరుకొని మొరం టిప్పర్లను అడ్డుకున్నారు. విచ్చలవిడిగా పెద్ద పెద్ద గుంతలు తీస్తూ మొరం తవ్వుతున్నారని, ఏమైనా ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. 3 గంటల పాటు టిప్పర్లను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న తహసీల్దార్‌తో మత్స్యకారులు వాగ్వాదానికి దిగారు. నిబంధనల మేరకు కాకుండా ఎక్కువ తవ్వితే జరిమానా విధిస్తామని, ఎంత లోతు మొరం తవ్వారో కొలతలు చేపట్టి, పంచనామా పత్రాన్ని అందించాలని ఇరిగేషన్ అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. మొరం టిప్పర్లు వెనుదిరగడంతో మత్స్యకారులు శాంతించారు.

# జీవితంలో ఫెయిల్ అయ్యా..



ఇద్దరు కూతుళ్లతో క్రాంతి (ఫైల్)

- అందుకే చనిపోతున్నా..
- 18 నెలల చిన్నారితో సహా తండ్రి ఆత్మహత్య
- రెండో పెండ్లి చేసుకోవాలని భార్యకు సూసైడ్‌నోట్


మోపాల్ (ఖలీల్‌వాడి), నవంబర్ 25 : జీవితంలో ఏదీ సాధించలేకపోతున్నా.. ఇలా బతకడం నావల్ల కావట్లేదని ఓ యువకుడు 18 నెలల తన కూతురితో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నువు రెండో పెండ్లీ చేసుకో అని భార్యనుద్దేశించి సూసైడ్‌నోట్ రాసిన అతడు.. మెదడు సరిగా ఎదగని బిడ్డ తన భార్య జీవితానికి అడ్డు కాకూడదని ఆమెను తీసుకుని చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మోపాల్ మండలం న్యాల్‌కల్ శివారులోని చెరువులో సోమవారం తెల్లవారుజామున ఈ హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్, స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని సీతారాంనగర్ కాలనీ (గాజుల్‌పేట్)లో నివాసముండే రఘుపత్రి క్రాంతికుమార్ (35)కి భార్య మానస, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గురుకుల పాఠశాలలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు.

**దీనస్థితిలో పాపను చూడలేక..**

18 నెలల కూతురికి చిన్నప్పటి నుంచి మెదడు ఎదుగుదల లేకపోవడంతో దవాఖానల చుట్టూ తిప్పితిప్పి అప్పుల పాలయ్యాడు. ఓవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు, పాప ఆరోగ్య పరిస్థితి క్రాంతిని మానసికంగా వేదనకు గురిచేశాయి. దీన స్థితిలో ఉన్న పాపను చూడలేక ఆమెను తీసుకుని సోమవారం తెల్లవారుజామున తన బైక్‌పై న్యాల్‌కల్ శివారులోని చెరువు వద్దకు చేరుకున్నాడు. చిన్నారితో సహా చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాలను వెలికి తీయించారు. మరోవైపు, క్రాంతి తన భార్యకు రాసిన సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'జీవితంలో ఏదీ సాధించలేకపోతున్నా. అన్నింటా ఫెయిల్ అయ్యా. ఇలా బతకడం నావల్ల కావడం లేదు. నాకు చావే శరణ్యం. అందుకే నా కూతుర్ని తీసుకుని చనిపోతున్నా. నువ్వు రెండో పెళ్లి చేసుకో' అని భార్యను ఉద్దేశించి సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నాడు.

# కేసీఆర్ సహకారంతో పేదలకు ఇండ్లు

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



కొల్లూరులో డబుల్‌బెడ్‌రూమ్ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, నవంబర్ 25: అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మంజూరు చేశామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పేద కుటుంబాలకు కూడు, గుడ్డతో పాటు నీడ అవసరమని, కేసీఆర్ సహకారంతో పేదల సొంతింటి కలను సాకారం చేశామన్నారు. బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపం, 50 డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, నాగారం గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గంలో అత్యధికంగా డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మంజూరు చేశామన్నారు.

# మడిగెను విక్రయించనందుకు న్యాయవాదిపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు
- నిందితులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ ఆందోళన





మడిగె వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, గాయపడిన ఖాసీం

వినాయక్‌నగర్, నవంబర్ 25 : తమ స్థలం పక్కన ఉన్న మడిగెను విక్రయించనందుకు ఓ న్యాయవాదిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై యాసిన్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఖిల్లారోడ్డులో న్యాయవాది ఖాసీంకు ఒక మడిగె (షట్టర్ రూం) ఉన్నది. మడిగె పక్కనే హర్షాద్‌ఖాన్ స్థలం ఉన్నది. తమ స్థలం పక్కన ఉన్న మడిగెను తమకు విక్రయించాలని హర్షాద్‌ఖాన్‌తోపాటు అతడి కుమారులు అడుగుతూ ఒత్తిడి చేశాడు. ఆదివారం రాత్రి ఖాసీం కార్యాలయంలో ఈ విషయమై మాట్లాడారు. తన కార్యాలయాన్ని ఇందులోనే నడుపుతున్నానని, విక్రయించే ఉద్దేశం లేదని ఖాసిం చెప్పడంతో ఆగ్రహించిన హర్షాద్‌ఖాన్‌తో పాటు అతడి కుమారులు ముజాహిద్ ఖాన్, ముజాఫర్ ఖాన్ దాడి చేయగా గాయాలయ్యాయి. ఖాసీం కుమారుడు ఖలీద్ ఫిర్యాదు మేరకు హర్షాద్‌ఖాన్‌తోపాటు ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన..**

సీనియర్ న్యాయవాదిపై దాడికి పాల్పడిన విషయం తెలుసుకున్న వెంటనే బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. విధులు బహిష్కరించి, బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ఖిల్లారోడ్డులోని ఖాసిం ఆఫీస్ వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. అనంతరం ఏసీపీ రాజావెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డితోపాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.